కథ

# తప్పుస్వరాలు

పెళ్లయిన పదేళ్లలో ఇది తీవ్రమైన వాగ్వివాదం!

ఇంతవరకూ ఏవేవో చిన్న చిన్న భేదాభిప్రాయాలు వచ్చాయి. సమసిపోయాయి. కానీ ఇంత తీవ్రంగా, ఎడమొహం, పెడమొహం పెట్టేంతగా, మనస్తాపం ఎప్పుడూ కలగలేదు.

''ఇవ్వాళ్ల మనం రవిశంకర్ ఇంటికెళ్లాలి. వెళ్దామా?'' మూడురోజుల మౌనం తరువాత నేను నాభార్యతో మాట్లాడిన మొదటి మాట అది.

''మీ ఇష్టం'' కోపం ప్రదర్శించటంలో తనని మించిన వాళ్లెవరూ లేరు.

''వాళ్లింటికి వెళ్లాలంటే తొమ్మిదిలోపలే వెళ్లాలి. మళ్లీ అటునుంచి మనం ఆఫీసులకి వెళ్లాలి'' మంచేమయినా కరుగుతుందేమోనని ఆశించాను.

''నేను రెడీ మీదే ఆలస్యం'' అన్నట్టు అంది.

''నేనూ రెడీ''

''వాళ్లముందు మీరు మన గొడవ విషయం ప్రస్తావించవద్దు. ప్రస్తావిస్తే చంపుతా'' అన్న బెదిరింపు కనబడింది.

ఆ బెదిరింపుకి 'అలాగే' అన్నట్టు నా తల కదిలింది.

బండి స్టార్ట్‌చేశాను. అంటీ అంటనట్టు కూచుంది.

నాదీ, స్రవంతిదీ ఆదర్శ దాంపత్యం అని అందరూ చెప్పుకుంటూంటారు. నిప్పులేందే పొగరాదు కాబట్టి దాన్లో బోలెడంత నిజం వుంది. పెళ్లనేది ఓ జూదం లాంటిది.

ఆ జూదంలో జాక్‌పాట్ నాది.

పెళ్లికి ముందు తనెవరో నేనెవరో. కానీ పెళ్లి అయిన మరుక్షణం నుంచీ నేనూ, స్రవంతి వాక్కు, అర్థం కలిసినట్టు కలిసిపోయాము.

పెళ్లికి ముందు నా జీవితం ఎడారి అయితే, పెళ్లి తరువాత నా జీవితం పూలతోట. అందుకు నిదర్శనం పెళ్లికి ముందు పుస్తకం కూడా ముట్టని నేను పెళ్లయిన తరువాత పుస్తకాలు రాయటమే!

మా ఇద్దరికీ నిశ్చితాభిప్రాయాలున్నాయి. కొన్ని విషయాల్లో రాజీపడతాము. నేను రాజీపడని విషయాల్లో తను రాజీపడుతుంది. తను ఓ మెట్టు దిగదని అర్థమయినప్పుడు నేను పది మెట్లు దిగుతాను.

కానీ ఈసారి సమస్యలో ఇద్దరం పట్టు విడిచే స్థితిలో లేము.

దాంపత్యంలో భార్యాభర్తల మధ్య మూడవ వ్యక్తి వస్తే సమస్యలు తప్పవంటారు. అది అనుభవానికి వచ్చింది.

పదేళ్ల తరువాత మామధ్య మూడవ వ్యక్తి రాబోతున్నాడు. రాకముందే గొడవలు ఆరంభమయినాయి.

''నాకు పిల్లలను క్రచ్‌లో వుంచటం ఇష్టం వుండదు. నువ్వు ఉద్యోగం మానెయ్'' అన్నాను నేను. అలా అన్నప్పుడు అదొక సమస్య అవుతుందని నేను ఊహించలేదు. ఊహించి వుంటే ఇంకోరకంగా అని వుండేవాడిని.

నేనామాట అనటంతోటే స్రవంతి కోపంగా నావైపు చూసింది. ''ఉద్యోగం మానాల్సిన అవసరం ఏముంది? మెటర్నిటీ లీవ్ సరిపోతుంది'' అంది.

నేను స్రవంతిని దగ్గర తీసుకుని, నుదురు చుంబించి, నుదుటి మీద వెంట్రుకలను పక్కకు నెడుతూ మృదువుగా అన్నాను. ''ఒక తరాన్ని ప్రసవించటమంటే ఒకనాడు కలల జగత్తును మేల్కొల్పటం. అదొక ఉత్కృష్టమైన బాధ్యత. పిల్లవాడికి శారీరక ఆరోగ్యం ఎంత ముఖ్యమో, మానసిక స్వస్థత అంత ముఖ్యం. అందుకు మనిద్దరిలో ఎవరో ఒకరు వాడికి ఊహ వచ్చేవరకూ వాడివెంట వుండాలి. అంతేకాదు పిల్లవాడి ఆలనా పాలన వాడు పుట్టకముందే అంటే కడుపులో పిండం ఎదగటం ఆరంభమయినప్పటి నుంచే ఆరంభం అవుతుంది. ఈ సమయంలో తల్లి మనస్సులోని ఆందోళన, ఉద్విగ్నతలు, భయాలు, అన్నీ వాడిపై ప్రభావం చూపిస్తాయి. అందుకే నువ్వు మీ ఆఫీసులో నోటీస్ ఇచ్చెయ్యి. హాయిగా ఇంట్లో మంచి సంగీతం వింటూ, మంచి సాహిత్యం వింటూ, సుఖంగా, ఉత్తమ ఆలోచనలతో కాలం గడుపు. పిల్లవాడు ఆరోగ్యంగా వుంటాడు.

స్రవంతి నావైపు విచిత్రంగా చూసింది.

''నేను చెప్పేది నిజం. మన పురాణాల్లో కూడా చూడు అభిమన్యుడు పద్మవ్యూహం గురించి మాతృగర్భంలోంచే తెలుసుకున్నాడు. ప్రహ్లాదుడికి విష్ణుభక్తి మాతృగర్భంలోంచే అలవడింది. వైజ్ఞానికంగా కూడా...''

''మీ ఎమ్మే సైకాలజీ తెలివి అంతా నామీదే ప్రదర్శించకండి. మీరు చెప్పేవి నిజాలే అయినా ఉద్యోగం మానాల్సిన అవసరంలేదు. ప్రెగ్నెన్సీ వచ్చిన ప్రతివాళ్లు ఉద్యోగాలు మానేస్తున్నారా?''

''అందరి సంగతి మనకనవసరం స్రవంతి. మన పిల్లవాడు మనకి ప్రత్యేకం.''

''ఏమో ఇద్దరం ఉద్యోగాలు చేయకపోతే వాడినెలా పోషిస్తాం? చదువులెలా చదివిస్తాం? వాడికి మంచి భవిష్యత్తునెలా ఇస్తాం?''

''కానీ...'' ఇంకా ఏదో వాదించబోతున్న నా నోరు మూసేసింది. వారం తరువాత మళ్లీ నేనే ఆ ప్రసక్తి తీసుకువచ్చా. ''మధ్యాహ్నం మా ఆఫీసులో అపర్ణని, వాళ్ల అబ్బాయిని క్రచ్ వరకూ తీసుకువెళ్లా''

''ఎందుకని?''

''వాళ్లబ్బాయి ఒంట్లో బాగాలేదట. విరేచనాలవుతున్నాయని ఆవిడ ఫోన్ చేసింది. ఈమెకు ఏం చేయాలో తెలియక ఏడుస్తుంటే తీసుకువెళ్లాను.''

''మీ సంగతి నాకు తెలుసు. మీకు ఆమెకి లిఫ్ట్ ఇచ్చే అవకాశం దొరికిందని సంతోషం'' అంది నవ్వుతూ.

నేను చెప్పదలచుకున్నది స్రవంతి గ్రహించలేదని అర్థమయింది. లేక గ్రహించలేనట్టు నటిస్తోందా?

''ఇవాళ మా ఆఫీసులో ఇంద్రాణిని చూస్తే జాలేసింది'' అన్నాను రెండ్రోజుల తరువాత.

''ఏమయింది పాపం?''

''ఆరునెలల తరువాత ఇవాళే ఆఫీసుకి వచ్చింది. వాళ్ల పాపను క్రచ్‌లో చేర్పించిందట. పాపను తలచుకుని ఏడుస్తూ కూచుంది. ఏం ఉద్యోగాలో అని తిట్టుకుంటుంది రోజంతా. క్రచ్‌లో వదులుతుంటే పాప ఏడ్చిన ఏడుపే చెవుల్లో ప్రతిధ్వనిస్తోందట.''

స్రవంతి టి.వి మీంచి దృష్టిని మరల్చలేదు. ''నాలుగు రోజుల్లో తల్లికీ, పిల్లకీ క్రచ్ అలవాటయిపోతుంది'' అంది.

నాకేం చేయాలో తెలియలేదు.

మరోరోజు ''సావిత్రి వాళ్ల పాప లేదూ, రోజూ ఈమె ఆఫీసుకి తయారయ్యేసరికి, ఇక క్రచ్‌లో వదులుతుందని గ్రహించి, మంచం క్రింద దాక్కుంటుందట. త్వరగా తయారుకాదట. బాగా ఏడిపిస్తుందట'' అన్నాను.

స్రవంతి నవ్వి ''మన సంతానానికి మీ పోలికే వస్తుందిలెండి. బుద్ధిగా చెప్పినట్టు వింటారు మనవాళ్లు'' అంది.

నాకు అరికాలిమంట నెత్తికెక్కింది. ''స్రవంతీ, ఇది నవ్వులాట కాదు. నువ్వే, నేనో ఉద్యోగం మానాల్సిందే. నాది ప్రభుత్వోద్యోగం కాబట్టి నువ్వు మానితే బాగుంటుంది'' కోపంగా అన్నాను. ''లేకపోతే నేనే మాని వుండేవాడిని'' కొసరంటించాను.

''నెలకి ఎనిమిదివేల ఉద్యోగం ఎవరైనా వదులుకుంటారా?'' అంతే కోపంగా అరిచింది.

''మనకి ఎనిమిదివేలు ముఖ్యంకాదు. వచ్చిన డబ్బులో సర్దుకుందాం'' నేనింకా గట్టిగా అరిచాను.

''మరి పిల్లవాడికేం పెడతారు? వాడికి మంచి చదువెలా చెప్పిస్తారు?'' అంతకన్నా గట్టిగా అరిచింది.

''అది అప్పుడు చూసుకుందాం. ప్రస్తుతానికయితే నువ్వు ఉద్యోగం మానాల్సిందే. ఈ విషయంలో రాజీప

డను'' అనేసి బయటకు వెళ్లిపోయాను.

ఈ మాటలు మా సంబంధంలో ఎవరు ఉచ్చరించినా రామబాణం లాంటివి. కానీ ఈసారి బాణం గురి తప్పింది.

అరగంట తరువాత నేను ఇంట్లో అడుగుపెట్టగానే స్రవంతి ''ఈ విషయంలో నేనూ రాజీపడను'' అనేసి పడక గదిలోకి వెళ్లి ధడేల్న తలుపు వేసేసుకుంది.

ముల్లును ముల్లుతోనే తీయాలి. రామబాణానికి ఎదురు రామబాణమే. ఆస్ట్రేలియాలో ఇండియా క్రికెట్ ఆటగాళ్లలా అయిపోయింది నా పరిస్థితి.

అప్పటినుంచీ మా ఇద్దరి మధ్య మాటలు లేవు.

బండి, రవిశంకర్ ఇంటిముందు ఆపాను మౌనంగా.

ఇద్దరం మౌనంగా వాళ్లింట్లోకి అడుగుపెట్టాం.

ముందు గదిలో రవిశంకర్ హడావిడిగా తల దువ్వుకుంటున్నాడు. నన్ను చూడగానే ''సారీరా ఇవాళ ఆఫీసుకి త్వరగా వెళ్లాలి'' హడావిడిగా అన్నాడు. అంతలో ఏదో ఆలోచన వచ్చినవాడిలా ''కాస్సేపు బాబీగాడిని చూసుకో. వదిన బాత్‌రూమ్‌లో వుంది. ఆమె వచ్చేవరకూ ఎలాగా అని ఆలోచిస్తున్నాను. టైమైపోతోంది'' అన్నాడు గబగబా.

నా దృష్టి గదిలో ఓ మూల కూచున్న బాబీగాడి మీద పడింది. వాడి వయసు ఒక సంవత్సరం.

వాడు మూల కూచుని ఏదో బొమ్మతో ఆడుకుంటున్నాడు. కానీ వాడి దృష్టి వాళ్ల నాన్నమీదే వుంది. ''చూపు మరల్చితే ఈయన ఎక్కడ అదృశ్యమౌతాడో'' అన్న భయం స్పష్టంగా కనిపిస్తోంది వాడి కళ్లల్లో.

స్రవంతి వాడి దగ్గరకు వెళ్లి ఎత్తుకోబోయింది. వాడు స్రవంతి వైపు నిశితంగా నిరసనగా చూసి మరింత మూలకు నక్కాడు.

సాధారణంగా వాడు స్రవంతి వైపు ఎగబడతాడు.

''ఏమైందిరా నీకివ్వాళ?'' వాడిని బలవంతంగా ఎత్తుకునే ప్రయత్నం చేసింది స్రవంతి. వాడు పెద్దగా కేక పెట్టాడు. తన మృదువైన చేతులతో 'ఫట్' మని స్రవంతి ముఖం మీద కొట్టాడు.

స్రవంతి నవ్వుతూ వాడిని ఎత్తుకుంది.

ఇంతలో వంటింట్లోంచి ఏదో మాడుతున్న వాసన వచ్చింది. బాబీని నాకందించి తను వంటింట్లోకి వెళ్లింది.

''వాడిని పైకి తీసుకువెళ్లు'' చెప్పాడు రవిశంకర్.

నేను నిలబడ్డాను. బాబీ నావైపు చూశాడు. రవిశంకర్ వైపు చూశాడు. మళ్లీ నావైపు చూశాడు. వాడి కళ్లల్లో నిరసన భావన కదలాడింది. అది నా భ్రమ ఏమో అనుకున్నాను. వాడిని ఎత్తుకుని బయటకు వస్తుంటే ఓసారి వాళ్ల నాన్న వైపు చూశాడు. తరువాత 'డల్' గా వున్నాడు.

వాడిని నవ్వించేందుకు మెట్లు గబగబా ఎక్కాను.

నావైపు నిర్భావంగా చూశాడు.

''అదిగో పిట్ట'' చూపించాను.

నిర్లిప్తంగా చూశాడు.

క్రింద బండి స్టార్టయిన శబ్దం వినిపించింది.


ఆవైపు తల తిప్పాడు. తరువాత నావైపు చూసి ''నాన్న ఆఫీచ్'' అన్నాడు.

నాకేడుపు వచ్చింది.

ఇంతలో ఓ పిల్లి కప్పు మీద కనిపించింది.

''బిల్లి బిల్లి'' ఉత్సాహంగా అరిచాడు.

వెలిగిపోతున్న వాడి మొహం కేసి చూస్తుంటే ఈ ఆనందం కోసం ప్రపంచం మొత్తాన్ని త్యజించవచ్చన్న భావన మెదిలింది.



వాడిని మళ్లీ ఇంట్లోకి తెచ్చాను.

ఇంట్లోకి రాగానే గబగబా దిగాడు. మొత్తం గదులన్నీ మౌనంగా కలయచూశాడు. వంటింట్లో వాళ్లమ్మ కనిపించింది. మౌనంగా ముందు గదిలోకి వచ్చి మళ్లీ ఆట వస్తువుల దగ్గరకు వెళ్లాడు.

''ఏమండీ, అక్కయ్యకు ఆలస్యం అయిపోయిందట. బస్సులో వెళ్లాలి కదా. వీడిని క్రచ్ దగ్గర మనల్ని దింపేయమంది. మనకదే త్రోవ కదా'' అంది స్రవంతి ముందు గదిలోకి వచ్చి.

ముఖం అయిష్టంగా పెట్టాను. పైకి 'సరే' అన్నాను.

నేను చేయి సాచగానే బాబీ నావైపు దూకాడు.

రవిశంకర్ భార్య ఓ బుట్ట స్రవంతికందిస్తూ ''నాకు టైమైపోయింది. బ్రేక్‌ఫాస్ట్ తినిపించలేదు. దీన్లో చిన్న టిఫిన్ వుంది చూడు. అది వాడికి బ్రేక్‌ఫాస్ట్. తినిపించమని ఆమెకి చెప్పు'' అంది.

స్రవంతి ఆ బుట్ట అందుకుంటుంటే వాడు అనుమానంగా చూశాడు. నేను ఏవో మాటలు చెప్తూ వాడిని బయటకు తెచ్చాను. వెంటనే స్రవంతి వచ్చింది. స్రవంతి చేయి సాచగానే 'చిన్న' అంటూ తనవైపు దూకాడు. బండి స్టార్టయ్యేసరికి వాడి భాషలో కబుర్లు చెప్పటం ఆరంభించాడు. బండి కాస్తదూరం వెళ్లేసరికి పాటలు ఆరంభించాడు.

కానీ క్రచ్ వెళ్లే సందు తిరిగేసరికి నిశ్శబ్దంగా అయిపోయాడు.

క్రచ్ ముందు స్కూటర్ ఆపాను.

బాబీగాడు సన్నగా ఏడుపు ఆరంభించాడు.

**కస్తూరి మురళీకృష్ణ**

క్రచ్‌లోకి అడుగుపెడుతూంటేనే పెద్దగా ఏడుపు ఆరంభించాడు. స్రవంతి చేతుల్లో నిలవటంలేదు.

క్రచ్ ఆవిడ వీడి ఏడుపు విని బయటకు వచ్చింది.

ఆమెని చూస్తూనే బాబీ ఏడుపు తీవ్రతరమయింది.

వాడు ఏడుస్తూ నావైపు చూశాడు.

నా గుండె కరిగి నీరైపోయింది. ఆ చూపు 'యూటూ బ్రూటస్' అన్నట్టుంది.

''రోజూ ఇలాగే ఏడుస్తాడా?'' ఆమెనడిగాను.

''ఏడవడు'' చెప్పింది.

''పద, వాళ్లమ్మకే ఇద్దాం'' అన్నాను స్రవంతితో.

మళ్లీ బండీ మీద కూచోగానే నిశ్శబ్దంగా అయ్యాడు. కాస్సేపటికి కబుర్లు ఆరంభించాడు.

మేము వెళ్లేసరికి రవిశంకర్ భార్య వెళ్లిపోయింది.

''ఏం చేద్దాం?'' అన్నాను.

''క్రచ్‌లో ఇచ్చేద్దాం. ఓ అరగంట ఏడ్చి వాడే ఊరుకుంటాడు'' అంది స్రవంతి.

ఒక్కక్షణం నాకు స్రవంతి అంటే అసహ్యం కలిగింది. కానీ చేసేదేముంది? లేకపోతే ఇద్దరిలో ఎవరో ఒకరు ఆఫీసు మానెయ్యాలి.

''చాక్‌లేట్ కొనిద్దాం. క్రచ్‌లో దింపేద్దాం'' అన్నాను.

మళ్లీ క్రచ్ సందు తిరుగుతూంటే ఏడుపు ఆరంభించాడు. ఈసారి ఏడుపు తీవ్రత అనూహ్యం. చేతిలోని చాకోలేట్లు క్రచ్ ఆవిడ ముఖం మీదకు విరిసేశాడు. ఆమెని దగ్గరకు రానివ్వటం లేదు.

వాడి ఏడుపు చూసి నా కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

పసి పిల్లవాడి ఆత్మవిశ్వాసం తల్లిదండ్రులు. తాము చేసే ప్రతి పనికీ సంతోషిస్తూ, పొగుడ్తూండాలి. తల్లిదండ్రుల జీవితంలో తమని మించి ప్రాముఖ్యం వహించే అంశం మరొకటి వుండకూడదని వాళ్లు వాంఛిస్తారు. కానీ తల్లిదండ్రుల రోజులో ఎనిమిది నుంచి ఏడు వరకూ తాము అవసరం అన్న భావనతో పెరిగే పిల్లలకు ఆత్మవిశ్వాసం ఏమిటి?

''పద స్రవంతీ'' అని బాబీగాడిని లాక్కుని గబగబా బయటకు నడిచాను. నా వెనుకే కోపంగా వచ్చింది. ''ఏం చేద్దాం?'' అనడిగింది కోపంగా.

వాడు ఏడుపు ఆపి నా నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నట్టు చూడసాగాడు.

''నేను సెలవు పెట్టేస్తాను. ఇంటికి తీసుకు వెళ్దాం'' అన్నాను.

''ఇవాళ ఒక్కరోజు మీరు చూస్తారు. రేపెలాగ? వీడొక్కడే కాదుకదా, ప్రతి ఒక్క పిల్లవాడినీ ఏం చేస్తారు?'' వ్యంగ్యంగా అడిగింది స్రవంతి.

నేను మాట్లాడలేదు. ఈమెకు నా బాధ ఎలా చెప్పాలి? ఎవరికైనా ఏం చెప్పాలి?

''అందరూ కొట్టుకుపోతున్న ప్రవాహంలో నువ్వా ఎందుకు కొట్టుకుపోవు?'' అని అడిగేవారికి ఏం సమాధానం చెప్పాలి?

''మాకెవరికీ పిల్లల మీద ప్రేమ లేదు?'' అని నిలదీసేవారినెలా సముదాయించాలి?

మౌనంగా బండి స్టార్ట్ చేశాను.

వాడు నవ్వుతూ స్రవంతితో కబుర్లాడటం ఆరంభించాడు.

''నేనూ ఇంటికి వస్తాను'' అంది స్రవంతి స్కూటర్ వాళ్ల ఆఫీసు సందులోకి తిప్పబోతూ వుంటే. నేనేమీ అనకుండా బండిని ఇంటిదారి పట్టించాను.

ఇల్లు చేరేసరికి బాబీని పట్టలేకపోయాం.

వాడి కళ్లు ఆనందంతో మెరుస్తున్నాయి.

ప్రపంచంలోని ప్రతి విషయం అద్భుతమే. ప్రతి విషయం ఆనంద కారకమే! సమయం ఎలా గడిచిందో తెలియదు.

'మెరుపు మెరిస్తే
వాన కురిస్తే
ఆకసమున హరివిల్లు విరిస్తే
అవి మీకే అని ఆనందించే కూనల్లారా!'

శ్రీశ్రీ కవిత అర్థం గ్రహింపుకు వచ్చింది. అయితే వాడు ఆటలాడుతూ కూడా మా ఇద్దరిలో ఏ ఒక్కరయినా కదలగానే నిశ్శబ్దమై 'వీళ్లు వదలి ఎక్కడకు వెళ్తారో' అన్నట్టు చూసేవాడు. అంతేకాదు కళ్లమీదకు నిద్ర వస్తూన్నా నిద్రను ఎగరగొట్టుకోవటం ఇద్దరం గమనించాము. కారణం ఊహించటం పెద్ద కష్టం కాలేదు. వాడు నిద్రపోతే మేం వదలి ఎక్కడికయినా వెళ్లిపోతామని భయం! పిల్లవాడి ఉజ్వల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు పిల్లలలో ప్రేమరాహిత్య భావనను, 'తాను అనాథ' అన్న భావనను కలిగిస్తున్నారా?

నా గుండెనెవరో మెలిపెట్టినట్టయింది వాడిని చూస్తూంటే.

మధ్యలో ఓసారి స్రవంతి వంటింట్లోకి వెళ్లింది.

వాడు కాస్సేపు చూసి నావైపు తిరిగి 'పిన్ని?' అన్నాడు ప్రశ్నార్థకంగా.

''ఆఫీసు'' అన్నాను నేను ఉట్టిగా.

వాడు కాస్సేపు అటూ ఇటూ చూసి ''పిన్ని ఆపీచు, నాన్న ఆపీచు, అమ్మ ఆపీచు'' అన్నాడు చేతులు తిప్పుకుంటూ. ఆ తరువాత మళ్లీ యోగిలా ఆటల్లో మునిగిపోయాడు.

నా గుండె బద్దలయింది.

తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగాలు చేసేది పిల్లవాడికి ఉజ్వల భవిష్యత్తునివ్వాలని. కానీ వాడి ఆటలు, పాటలు, మొదటి అడుగు, తొలి మాట, సర్వం వేరేవారెవరో, ఆ చర్యలలోని ఆనందాన్ని అనుభవించే అవసరం లేనివారి పాలబడుతున్నాయి, అడవిలో వెన్నెల కాసిన చందాన!

పిల్లవాడికి తల్లిదండ్రులు భవనాలివ్వక్కరలేదు. మణిమాణిక్యాలివ్వనక్కర్లేదు. వాడికి ప్రేమనివ్వాలి. ఆత్మవిశ్వాసాన్నివ్వాలి. తాను తల్లిదండ్రుల జీవితంలో ఓ అపురూపమైన పుష్పమన్న భావననివ్వాలి. ఇవేవీ లేక జీవం లేని డబ్బుల కుప్పలు పోసి ఏం లాభం?

కానీ జీవితంలో డబ్బు ప్రాముఖ్యాన్ని కాదనటం ఎలా? మిగతావారి సంగతి తనకనవసరం. కానీ స్రవంతికి ఈ విషయాన్నెలా చెప్పటం?

సాయంత్రం మళ్లీ వాడిని తిరిగి తీసుకువెళ్తూంటే అడిగింది స్రవంతి.

''రోజూ ఏడవని వీడు ఇవాళ్లెందుకు ఏడ్చాడు?'' అని.

''మనం క్రచ్‌లో వదలమన్న నమ్మకాన్ని భంగం చేసినందుకు వాడి నిరసన అది. స్రవంతీ, పిల్లలకేం తెలియదని తల్లిదండ్రులనుకుంటారు. కానీ ఏమీ తెలియనిది తల్లిదండ్రులకే'' అన్నాను.

స్రవంతి ఏమీ మాట్లాడలేదు.

వాళ్ల అమ్మ, నాన్నని చూడగానే వాడు మమ్మల్ని మరచిపోయాడు. వాళ్లతో ఆటలు, మాటలు ఆరంభించాడు.

''మొత్తానికి మీ మెత్తదనం చూసి దెబ్బకొట్టాడు మావాడు. దొంగ రాస్కెల్ వీడు'' ప్రేమగా వాడి తల నిమిరాడు రవిశంకర్.

మేం వచ్చేస్తుంటే బాబీగాడు మావైపు చూడలేదు. మంచం మీద పడుకుని పాలపీక చప్పరిస్తున్నాడు.

మేమిద్దరం మౌనంగా ఇల్లు చేరాం.

అప్పుడు గుర్తుకువచ్చింది మా ఇద్దరి మధ్య 'కోల్డ్‌వార్' నడుస్తోందని. ఇద్దరం మాట్లాడుకోలేదు.

తెల్లారి మెలకువ వచ్చేసరికి నా ఎదురుగా టేబుల్ మీద పెద్దగా రాసి వుంది 'సారీ' అని.

నమ్మలేకపోయాను.

స్రవంతి వచ్చి నా ఎదురుగా నిలబడింది. ఆమెను ఆనందంగా దగ్గరకు తీసుకుని ఏదో అనబోయాను.

''మీరేమీ అనవద్దు. వాడికి సారీ చెప్పేకన్నా, మీకు సారీ చెప్పటం సులభం అనిపించింది. ఎందుకంటే అప్పటికే తిరిగి వెనక్కు తీసుకోలేని కాలం ముందుకు సాగిపోతుంది'' అంది స్రవంతి.

ఆమెను దగ్గరగా లాక్కున్నాను.

నా మనస్సులో నాకు నచ్చిన కవితలోని పంక్తులు మెదిలాయి.

ఒక తరాన్ని ప్రసవించటం అంటే తమాషా కాదు.

ఒక నిండు కలల జగత్తునే మేల్కొల్పటం.

ఎన్నో అవ్యక్తాత్మలు, చిత్ర విచిత్రానుభూతుల ఒడిలో స్పందన పొందిన తరుణాల స్వరాలు, ఈ తరాలు!

★

